సాక్షి
సిద్దిపేట
గురువారం ı 23 ı నవంబర్ ı 2023



ఆటలు అట్టహాసంగా..

సిద్దిపేట జిల్లా వర్గల్ పూలే గురుకులం వేదికగా నాలుగు రోజులపాటు కొనసాగే ఈ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.
వివరాలు 10లో ▸



శిలాఫలకం ధ్వంసం

హుస్నాబాద్ ఐఓసీ భవనం ఎదుట ప్రభుత్వ భూమిలో టీఎన్‌జీఓ భవనానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. వివరాలు 10లో ▸



బీఆర్‌ఎస్‌కు మద్దతుగా..

బీఆర్‌ఎస్‌కు మద్దతుగా బుధవారం సిద్దిపేటలోని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మాజీ చైర్మన్ రాజనర్సు తదితరులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.
వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

పోలీస్ కమిషనర్ శ్వేత



సిద్దిపేట త్రీటౌన్ పీఎస్‌లో అధికారులకు సూచనలు చేస్తున్న సీపీ శ్వేత

సిద్దిపేటఅర్బన్: శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని పోలీస్ కమిషనర్ శ్వేత తెలిపారు. బుధవారం వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్లను సందర్శించారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గురించి ఆరా తీశారు. పటిష్ట బందోబస్తు కోసం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమష్టిగా విధులు నిర్వహించాలని పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచించారు. స్వేచ్ఛగా, ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి, టూటౌన్ సీఐ రవికుమార్, త్రీటౌన్ సీఐ భాను ప్రకాష్, ఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కొమురవెల్లి పాత కమాన్ దారి మూసివేత



దారి మూసివేస్తున్నట్లు ఏర్పాటు చేసిన బోర్డు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి వచ్చే పాత కమాన్ దారి మూసివేశారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు బుధవారం ప్రారంభించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సిద్దిపేట నుంచి కొమురవెల్లి వచ్చే భక్తులు గౌరాయపల్లి గుండా, హైదరాబాద్ నుంచి వచ్చే భక్తులు తిమ్మారెడ్డిపల్లి కమాన్ మీదుగా కొమురవెల్లికి చేరుకోవాలని తెలిపారు. భక్తులు గమనించి సహకరించాలని కోరారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ క్రీడాపోటీలు

గజ్వేల్‌రూరల్: ఉమ్మడి మెదక్ జిల్లా పాలిటెక్నిక్ క్రీడాపోటీలను గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు గజ్వేల్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలో క్రీడాపోటీలు జరుగుతాయన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు.

బీజేపీకే మా మద్దతు

మాదిగ దండోరా జిల్లా ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీకే మాదిగ, ఉపకులాల సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు మాదిగ దండోరా జిల్లా ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్ తెలిపారు. బీజేపీకి ఎమ్మార్పీఎస్ మద్దతు ఇస్తున్న నేపథ్యంలో బుధవారం సిద్దిపేట బీజేపీ అభ్యర్థి శ్రీకాంత్‌రెడ్డికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మాదిగ వర్గీకరణ కోసం అనేక వ్యయ ప్రయాసలకు గురయ్యామన్నారు. అన్ని పార్టీలు తమను కేవలం ఓటు బ్యాంకుగా చూశాయన్నారు. బీజేపీ మాత్రమే తమ ఆకాంక్షను గుర్తించి, వర్గీకరణకు పూర్తి హామీ ఇచ్చిందన్నారు. అందువల్ల రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలు కృషి చేస్తాయన్నారు. కార్యక్రమంలో మల్లిగారి యాదగిరి, ముంద్రాతి కృష్ణ, జీపీ లత, మైసరాములు, సామ్రాట్ ప్రకాశ్, పెరిక పరశురాములు, జరిపోతుల లక్ష్మణ్, సుంచు రమేశ్, లింగంపల్లి రాకేశ్, మాట్ల వెంకటస్వామి సనవల ప్రసాద్ , కందికట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోండి

దుబ్బాక: పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న అధికారులు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్, దుబ్బాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి గరిమా అగర్వాల్ అన్నారు. బుధవారం దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌ను ఆమె పరిశీలించారు. దరఖాస్తు చేసుకున్న 153 మందికి గాను 122 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.

బీజేపీ డకౌట్ ఖాయం



మిరుదొడ్డి మండలంలో జరిగిన రోడ్‌షోకు హాజరైన ప్రజలు

బీఆర్‌ఎస్ వైపే ప్రజలు
- గ్యారంటీలేని కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు
- కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలిచిన వెంటనే రెవెన్యూ డివిజన్‌గా దుబ్బాక
- మంత్రి హరీశ్‌రావు
- పలుచోట్ల రోడ్‌షోలు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ డకౌట్ కావడం ఖాయమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మిరుదొడ్డి మండల కేంద్రంతో పాటు, అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి బుధవారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో మోటార్లకు మీటర్లు పెట్టనందునే రాష్ట్రానికి వచ్చే రూ.25 వేల కోట్లు ఇవ్వలేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తేల్చి చెప్పారన్నారు. కాంగ్రెస్, బీజేపీలు అధికారంలోకి వస్తే కరెంటు కష్టాలు, మోటార్లకు మీటర్లు తప్పవన్నారు. గ్యారంటీ లేని స్కీంలతో కర్ణాటక మంత్రాన్ని నమ్ముకున్న కాంగ్రెస్‌కు తెలంగాణలో ఓటరు దెబ్బకు దిమ్మదిరగాల్సిందేనన్నారు. బోరు మోటార్లకు మీటర్లు పెడతానన్న బీజేపీ కావాలా? రైతులకు 5 గంటల కరెంటు ఇస్తానంటున్న కాంగ్రెస్ పార్టీ కావాలా? 24 గంటల కరెంటు ఇచ్చే కేసీఆర్ కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. పొంతన లేని హామీలతో అరచేతిలో వైకుంఠం చూపిన రఘునందన్‌రావు బీజేపీ ఎమ్మెల్యేగా గద్దెనెక్కాడన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిపోయిన రఘునందన్‌రావు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నాడని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే అసైన్డ్ భూములను లాక్కుంటుందని రఘునందన్‌రావు అసత్య ప్రచారం చేస్తున్నాడని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే అసైన్డ్ ల్యాండ్ భూములను ఎవ్వరూ గుంజుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలవగానే దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామన్నారు.

రామక్క పాటను కాపీ కొట్టారు

కల్వకుర్తికి చెందిన ఓ చెల్లెమ్మ కేసీఆర్ మీద ఉన్న ప్రేమతో పాడిన రామక్క పాటను సైతం కాంగ్రెస్, బీజేపీలు కాపీ కొట్టాయని మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారాల్లో దుమ్ము రేపుతున్న రామక్క పాట కాంగ్రెస్ నాయకుల వెన్నులో చలి పుట్టిస్తోందన్నారు.

ప్రజా సేవకే అంకితం: ప్రభాకర్‌రెడ్డి

మృత్యుకోరల్లో నుంచి బయటపడి పునర్జన్మ నెత్తిన తాను ప్రజాసేవకే అంకితమవుతానని దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రాజకీయాల్లో ఎదుర్కోలేక నన్ను చంపాలని చూశారని ఆరోపించారు. ప్రజల ఆశీర్వాద బలం వల్ల బతికి మీ ముందుకు వచ్చానన్నారు. దుబ్బాక ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి, పార్టీ రాష్ట్ర నాయకులు తోట కమలాకర్‌రెడ్డి, మండల నాయకులు తోట అంజిరెడ్డి, మిరుదొడ్డి, అక్బర్‌పేట, భూంపల్లి సర్పంచులు రాములు, స్వరూప, భాగ్యలక్ష్మి, ఎంపీటీసీలు లక్ష్మి, నర్సింహులు, కో ఆప్షన్ మెంబర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

కలిసి పనిచేద్దాం..

సిద్దిపేటజోన్: ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి సిద్దిపేట గౌరవాన్ని మెజార్టీ రూపంలో చాటాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. బుధవారం తన నివాసంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మహేశ్, బీజేవైఎం జిల్లా నాయకులు సాయి వెంకట్, అర్బన్ శాఖ అధ్యక్షుడు ప్రవీణ్ తమ అనుచరులతో కలిసి మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సిద్దిపేట అభ్యున్నతికి శాయశక్తులా పనిచేసినట్లు చెప్పారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సిద్దిపేటకు హరీశ్‌రావు ఉండటం చాలా అదృష్టమన్నారు. అన్ని వర్గాలకు పార్టీ సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, కౌన్సిలర్ అరవింద్ రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మంత్రి సమక్షంలో చేరిన బీజేపీ నాయకులు

అధికారమిస్తే అండగా ఉంటాం

- గజ్వేల్‌కు భారీ పరిశ్రమలు తెస్తాం
- నిరుద్యోగ, యువత ఉపాధికి బాటలు వేస్తాం
- పింఛన్ రూ.4వేలకు పెంచుతాం
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- గజ్వేల్‌లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభ

గజ్వేల్: అధికారమిస్తే అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తామని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం గజ్వేల్ పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డిని గెలిపించాలని కోరుతూ నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ తీరుపై మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడగొట్టిన వెంటనే రూ.2వేలు ఉన్న పింఛన్‌ను రూ.4వేలకు పెంచుతామన్నారు. గజ్వేల్ ప్రాంతానికి భారీ పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగ, యువత ఉపాధికి బాటలు వేస్తామని హామీ ఇచ్చారు. మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని చెప్పారు. ఆరు గ్యారంటీలతో పేద, మధ్యతరగతి వర్గాల్లో వెలుగులు నింపుతామన్నారు. తనకు అధికారమిస్తే పనిచేస్తా.. లేదంటే ఫామ్ హౌస్‌లో రెస్ట్ తీసుకుంటానని చెబుతున్న కేసీఆర్‌ను పొలిమేరల్లోకి తరిమికొట్టడానికి గజ్వేల్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. గజ్వేల్‌తోపాటు, కామారెడ్డిలోనూ కేసీఆర్‌కు ఓటమి తప్పదన్నారు.



గజ్వేల్ బహిరంగ సభలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

కేసీఆర్ మాటలు నమ్మితే మళ్లీ మోసపోతాం..

కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ ఓటమి భయంతో కేసీఆర్ బీఆర్‌ఎస్ కార్యకర్తలను, నాయకులను బతిమాలుకుంటున్నారని ఆరోపించారు. ఇంతకాలం మీకు సమయం ఇవ్వలేదు.. మూడోసారి గెలిపిస్తే నెలకో రోజు నియోజకవర్గానికి కేటాయిస్తానని చెబుతున్నారని అన్నారు. కేసీఆర్ మాటలను ఎవ్వరూ నమ్మేస్థితిలో లేరని తెలిపారు. తనను గెలిపిస్తే 24గంటలు అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. ఇంకా ఈ సభలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని(యాదగిరి, నాయకులు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, సెంటూర్ రంగారెడ్డి, సర్దార్‌ఖాన్, సాజిద్ బేగ్, నేత మహేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, హన్మంతరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.



గజ్వేల్ సభకు హాజరైన ప్రజలు

ఓటర్ స్లిప్పుల పంపిణీ కొనసాగుతోంది

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఉన్నతాధికారులకు తెలిపారు. బుధవారం ఢిల్లీ నుంచి సీనియర్ డీఈసీ నితేశ్‌కుమార్ వ్యాస్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పాల్గొన్నారు. నితీష్ కుమార్ వ్యాస్ మాట్లాడుతూ నూతన ఓటర్లకు ఓటర్ గుర్తింపు కార్డుల పంపిణీ, జిల్లాలో వంద శాతం ఓటింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ చీటీల పంపిణీ 70శాతం పూర్తయిందన్నారు. సమావేశంలో డీపీఆర్‌ఓ రవీ కుమార్, ఎలక్షన్ సూపరింటెండెంట్ రామేశ్వర్, ఎలక్షన్ డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

ఎన్నికలప్పుడే మీటర్ల ప్రస్తావన

- మంత్రివి తప్పుడు ఆరోపణలు
- బీజేపీ సిద్దిపేట అభ్యర్థి దూది శ్రీకాంత్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ వస్తే మోటార్లకు మీటర్లు పెడతారని మంత్రి హరీశ్‌రావు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఈ విషయం ఎన్నికలప్పుడే తెరపైకి తీసుకువస్తారని పార్టీ సిద్దిపేట అభ్యర్థి దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ ఎన్నికల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో మోటార్లకు మీటర్లు పెడతారని చెప్పినా ప్రజలు బీజేపీని గెలిపించారన్నారు. మీ తప్పుల్ని కప్పిపుచ్చుకోవడానికి బీజేపీ పై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతుబంధు చిన్న, సన్నకారు రైతులకంటే భూస్వాములకే లాభం చేకూరుతోందన్నారు. ఫసల్ భీమా రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. వడగళ్ల వర్షానికి నష్టపోయిన రైతులను ఇంత వరకు ఆదుకోలేదని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక వరికి రూ.3100 మద్దతు ధర ఇస్తామని మేనిఫెస్టో లో పెట్టిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి దూది శ్రీకాంత్‌రెడ్డి

పసుపు బట్టలతో ప్రమాణం చేస్తా..

నాపై బురద చల్లడం సరికాదని నేను తెల్లకాగితం లాంటి వాడినని నేను ఎవరికీ అమ్ముడు పోలేదని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. నాపై వస్తున్న ఆరోపణలు నిజం కాదని తెలిపేందుకు గురువారం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో పసుపు తడి బట్టలతో ప్రమాణం చేస్తానన్నారు. నేను బీఆర్‌ఎస్ నాయకుల నుంచి రూపాయి తీసుకున్నట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని అన్నారు. సిద్దిపేట ఓటర్లు నాకు అవకాశం ఇచ్చి ఆదరించాలని శ్రీకాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

అద్దెకిచ్చిన ఇంటిని ఖాళీ చేయించడం లేదని..

- మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య
- వర్గల్ మండలంలో ఘటన

వర్గల్(గజ్వేల్): అద్దెకు ఇచ్చిన ఇంటి విషయంలో కొడుకు తన మాట వినడంలేదని మనస్తాపంతో తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వర్గల్ మండలం వేలూరులో చోటుచేసుకుంది. గౌరారం ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేలూరుకు చెందిన దాచారం ముత్యాలు(55)కు భార్య శివలక్ష్మి, కొడుకు భూపాల్ ఉన్నారు. తల్లిదండ్రులు, కొడుకు కోడలు ఒకే ఇంట్లో వేర్వేరుగా ఉంటున్నారు. ఏడాదిన్నర క్రితం వారు గ్రామంలో మరో ఇంటిని కొనుగోలు చేసి అద్దెకు ఇచ్చారు. ఆ ఇంటిని ఖాళీ చేయిస్తే తాము అందులో ఉంటామని 20 రోజులుగా తండ్రి ముత్యాలు కుమారుడితో గొడవ పడుతున్నాడు.



దాచారం ముత్యాలు (ఫైల్)

అద్దెకు ఇచ్చిన వారితో మాట్లాడి నెలరోజులలో ఖాళీ చేయిస్తానని భూపాల్ తన తండ్రికి చెప్పాడు. దీంతో భార్యతో కలిసి ముత్యాలు వేరే ఇల్లు కిరాయికు తీసుకున్నాడు. మంగళవారం రాత్రి అందరూ భోజనాలు చేసి పడుకున్నారు. ఉదయం భార్య శివలక్ష్మి లేచిచూస్తే ఇంట్లో ముత్యాలు కనిపించలేదు. అతని కోసం చుట్టుపక్కల వెతకగా గ్రామ శివారులోని రంగం చెరువు వద్ద చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. ఇల్లు ఖాళీ చేయించడంలేదన్న మనస్తాపంతో తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నట్లు భూపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రతిరోజూ ప్రజల ముంగిట..

జనగామ, చేర్యాల పట్టణాల సుందరీకరణ
- కొమురవెల్లి పుణ్యక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తా..
- ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి
- నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు
- పార్టీ కేడర్ గౌరవం పెంచుతా..
- 'సాక్షి'తో బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: గెలుపొందిన తర్వాత ప్రతిరోజు ప్రజల ముంగిట ఉంటానని బీఆర్‌ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే.. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసమస్యలు, నిధుల సమీకరణ తదితర విషయాలపై బుధవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూ వివరాలు ఆయన మాటల్లోనే..

జనగామ, చేర్యాల పట్టణంలో స్థిర నివాసం ఏర్పరచుకుని, నియోజకవర్గ సమస్యలు తెలుసుకునేందుకు రోజూ ఉదయం 7 గంటల నుంచి ప్రజలకు అవకాశం కల్పిస్తా. ప్రతీ ఒక్కరితో మాట్లాడుతా. పనులు, సమస్యలకు సంబంధించి వచ్చిన ప్రతి దరఖాస్తుపై దృష్టి పెడతా. పనులు పెండింగ్‌లో ఉంటే సంబంధిత అధికారులతో స్వయంగా మాట్లాడి సత్వర పరిష్కారానికి కృషి చేస్తా. 2014 తర్వాత తమకున్న ఎడ్యుకేషన్ సంస్థల పర్యవేక్షణ బాధ్యత పూర్తిగా సతీమణి నీలిమ, పిల్లలు చూసుకుంటున్నారు. నాకున్న బాధ్యతల్లా ప్రజలకు సేవ చేయడమే. ఎవరైనా నేరుగా వచ్చి సమస్యలు చెప్పుకునే విధంగా పాలన ఉంటుంది. జనగామ అభివృద్ధికి అవసరమైన సమయంలో ప్రగతి భవన్‌కు వెళ్లి కావాల్సిన నిధులు పట్టుకొస్తా.

53/1 సర్వే నంబర్‌లో అర్హులకు పట్టాలు..

జనగామ పట్టణం ధర్మకంచలో రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న 53/1 సర్వే నంబర్ పరిధిలో అర్హులందరికీ పట్టాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటా. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జనగామ, చేర్యాల అభివృద్ధి హామీకి కట్టుబడి ఉంటా. జనగామ పట్టణంలో పార్కులను అభివృద్ధి చేసి ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తా. మున్సిపాలిటీ పరిధి 30 వార్డుల్లో సీసీరోడ్ల నిర్మాణం, రంగప్పచెరువు, బతుకమ్మకుంటను మరింత సుందరీకరించడానికి చర్యలు చేపడతాను. చీటకోడూరు ఫిల్టర్ బెడ్ ద్వారా తాగునీటిని మరింత శుద్ధి చేసి మూడు నెలల్లో ప్రతి ఒక్కరూ తాగేలా చేస్తాం. అంబేడ్కర్ భవనం, కమ్యూనిటీ హాళ్లు, కళానిలయం ఏర్పాటుపై దృష్టి పెడతా. చేర్యాల, పెదమల్లన్న చెరువులను అభివృద్ధి చేయడంతోపాటు కొమురవెల్లి పుణ్యక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తాం.

పార్టీ కేడర్‌కు సముచిత స్థానం..

పార్టీ కేడర్ కృషి, శ్రమ ఫలితంగానే ఈ ఎన్నికల్లో ముందుకు వెళ్తున్నాం. కార్యకర్తలు, నాయకుల శ్రమకు గౌరవం, సముచిత స్థానం ఉంటుంది. కార్యకర్తలు లేకుండా ఏదీ సాధించలేం. పైసా ఖర్చు లేకుండా.. జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని నామినేటెడ్, పార్టీ పోస్టుల్లో ఉద్యమకారులతో పాటు అర్హులందరికీ అవకాశం కల్పిస్తాం.

'తపాస్‌పల్లి' సామర్థ్యం పెంపు

తపాస్‌పల్లి రిజర్వాయర్ సామర్థ్యాన్ని సుమారు రూ.350 కోట్ల నిధులతో 1.5 టీఎంసీలకు పెంచుతున్నాం. పెండింగ్‌లో ఉన్న కాల్వల నిర్మాణానికి భూ సేకరణ పూర్తి చేసి ప్రతీ ఎకరాకు సాగు నీరు అందిస్తాం. మల్లన్నసాగర్ మీదుగా తపాస్‌పల్లి నుంచి అన్ని మండలాలకు గ్రావిటీ ద్వారా సాగు నీరు అందించే విధంగా ప్లాన్ ఉంది.

నిరుద్యోగులకు ఉపాధి

జిల్లాలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. పాల ఉత్పత్తికి అనుగుణంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పుతాం. పామాయిల్ సాగు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో అందుకు తగినట్టుగా వ్యాపా రం జరిగేలా చూస్తాం. ఆగ్రోస్ బేస్డ్ విత్తనాల తయారీ కేంద్రం, పాలీటెక్నిక్, పారామెడికల్, వ్యవసాయ, ఇంజ నీరింగ్ కళాశాలలతో ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత భలో పేతం చేసే విధంగా ప్లాన్ చేసుకున్నాను. కాలక్రమేన జనగామను ఐటీహబ్‌గా మార్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నాను.



'కొమ్మూరి'తో నాకు పోటీ లేదు

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి స్వగ్రామం నర్సాయపల్లి జనగామకు ఎంతదూరమో.. నా ఊరు షోడశపల్లి అంతకంటే తక్కువ డిస్టెన్స్‌లో ఉంటుంది. 'ఆదివారం ఎమ్మెల్యే'గా పేరు తెచ్చుకున్న ఆయన.. మిగతా వారు కూడా గట్లనే ఉంటారేమో అనుకుంటున్నరు. కొమ్మూరి మాదిరిగా ఇష్టం వచ్చినట్టు నేను మాట్లాడను. రౌడీల రాజ్యం ఉండదు. పదేళ్ల నుంచి వ్యాపారులు, అన్ని వర్గాల ప్రజలు ఎలా ప్రశాంతంగా ఉన్నారో అదే కంటిన్యూ అవుతుంది. నాలుగు పార్టీలు మారిన ఆయన.. పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. తన గురించి మాట్లాడే అర్హత కూడా ప్రతాప్‌రెడ్డికి లేదు. వ్యక్తిగత విమర్శలు సిగ్గుచేటు. కొమ్మూరితో తనకు ఎటువంటి పోటీ లేదు.

క్లుప్తంగా

రూ.1.01 లక్షలు సీజ్

వర్గల్(గజ్వేల్): ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. 1,01,000 నగదును ఓ వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు వర్గల్ మండలం గౌరారం ఎస్సై విజయభాస్కర్ తెలిపారు. బుధవారం గౌరారం వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా అశోక్ లేలాండ్ ట్రాలీ ఆటోలో వ్యక్తి వద్ద నగదు గుర్తించామన్నారు. సీజ్‌చేసిన నగదు వర్గల్ ఎఫ్ఎస్‌టీ టీమ్‌కు అందజేశామన్నారు.

కేసీఆర్‌కే మా ఓటు..

తీర్మాన ప్రతులు హరీశ్‌రావుకు అందజేత



తీర్మాన ప్రతులు మంత్రి హరీశ్‌రావుకు అందిస్తున్న సభ్యులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని ఆర్‌ఎంపీల సంఘం సభ్యులు, రాయవరం గ్రామంలో హమాలీ సంఘం సభ్యులు ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌కే మా ఓటంటూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీనికి సంబంధించిన ప్రతులను బుధవారం మంత్రి హరీశ్‌రావుకు అందజేశారు. కుకునూరుపల్లి మండల ఏర్పాటు 30 ఏళ్ల కలను సాకారం చేసినందుకు గ్రామాల్లో ప్రజలకు సకాలంలో వైద్యం అందేలా ఆర్‌ఎంపీలకు సహకరిస్తున్నందుకు కేసీఆర్‌కు ఓటు ద్వారా రుణం తీర్చుకుంటామంటూ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పావణి, కొండపోచమ్మ దేవాలయ డైరెక్టర్ లక్ష్మణ్‌రాజు, ఆర్‌ఎంపీలు సుదర్శన్, లగిశెట్టి కనకయ్య పాల్గొన్నారు.

మిత్రమా రాత్రి కలుద్దాం..

పగలు ప్రచారం.. రాత్రి వ్యూహం

- ప్రణాళికతో ముందుకెళ్తున్న అభ్యర్థులు
- సామాజికవర్గాల వారీగా సమావేశాలు
- కులపెద్దలతో మంతనాలు
- ఓటర్లను ఆకర్షించేందుకు పడరాని పాట్లు



జంగ్ తెలంగాణ

జోగిపేట (అందోల్) : ఎన్నికల ప్రచారం రోజురోజుకూ ముమ్మరవుతోంది. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఇందులో భాగంగా అనుచరుల్లోని ముఖ్యులను రంగంలోకి దింపి ఓటర్లను ఆకర్షించేందుకు యతిస్తున్నారు. ప్రధానంగా సామాజికవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి ముందస్తుగా హామీలు ఇచ్చి గెలుపునకు సహకరించాలని కోరుతున్నారు. కుల పెద్దలను రహస్యంగా సంప్రదిస్తున్నారు. పగలు ప్రచారం.. రాత్రి మంతనాలు సాగిస్తూ అభ్యర్థులతోపాటు వారి అనుచరులు పడరాని పాట్లు పడతున్నారు. అన్ని సామాజిక వర్గాల మద్దతు లభిస్తే విజయం సునాయాసమన్న భావనలో అభ్యర్థులున్నారు. కుల సంఘాల వారీగా ఓటర్లను గుర్తించేందుకు ప్రత్యేకంగా టీమ్‌ను తయారు చేసుకొని తీసివేతలు, కూడికలు మొదలుపెట్టారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు వెళ్లి ఓట్లు అడిగే సమయం లేదు. దీంతో ప్రధాన గ్రామాలపై దృష్టి సారించిన నేతలు పగలు ప్రచారం చేస్తూ రాత్రి వేళ మంతనాలు చేస్తున్నారు.

కులపెద్దలతో మంతనాలు

ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు కులాలు, మతాల వారీగా ఓటర్లను గుర్తించి ఆయా వర్గాలకు చెందిన పెద్దలతో మంతనాలు చేస్తున్నారు. ప్రతిరోజూ సమయం దొరికినప్పుడల్లా ఫోన్లలో వారిని ఆప్యాయంగా పలుకరించి గెలుపునకు సహకరించాలని కోరుతున్నారు. ఇదే సమయంలో స్థానిక సమస్యలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వారితో ప్రస్తావించి గెలిచిన వెంటనే పరిష్కరిస్తామని హామీలిస్తున్నారు. ప్రతీ ఎన్నికల్లో కొన్ని సామాజికవర్గాలు అభ్యర్థుల గెలుపోటములను శాసిస్తున్నాయి. అలాంటి సామాజికవర్గాన్ని గ్రామాల వారీగా గుర్తించేందుకు అభ్యర్థులు పక్కా ప్రణాళిక రూపొందించుకునే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎక్కువ ఓట్లు కలిగి ఉన్న సామాజికవర్గాన్ని గుర్తించి వారి మద్దతును తమవైపు తిప్పుకునే పనిలో పడ్డారు. నియోజకవర్గంలో 40 నుంచి 45శాతం ఓటర్ల మద్దతును కూడగట్టుకుంటే విజయం తథ్యమనే భావన అభ్యర్థుల్లో నెలకొంది.

రెండు వైపులా వారే...

పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరిని నమ్మాలో..? ఎవరిని దూరంగా ఉంచాలో అర్థం కాని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉదయం ఓ అభ్యర్థి ప్రచారంలో కనిపిస్తున్న వ్యక్తులు చీకటి కాగానే మరో అభ్యర్థి శిబిరంలో చేరిపోతున్నారు. తమకే ఓట్లు వేయిస్తామని నమ్మబలుకుతున్నారు. మందు, విందు పార్టీల్లో మునిగి తేలుతున్నారు. ఒక్కరుగా వెళ్లకుండా కొంత మందిని పోగేసుకొని వెళ్తున్నారు. వీరిని బుజ్జగించడానికి అభ్యర్థులు తంటాలు పడుతున్నారు. మరికొందరు ఇప్పటికే ఫిరాయింపులకు పాల్పడి చేరిన పక్షం వైపు చక్రం తిప్పుతున్నారు.

ఎన్నికల సిత్రాలు

చకాచకా కత్తిరిస్తా.. ఓటు పట్టేస్తా..

మంత్రి హరీశ్ రావుకు మద్దతుగా సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. లక్షన్నర మెజార్టీ లక్ష్యంగా ప్రతీ ఒక్కరినీ ఓట్లు అడుగుతున్నారు. స్థానిక భారత్‌నగర్‌లో ఒక దర్జీ షాపులో బట్టలను కొలత మేరకు కత్తిరించి, పనిలో పనిగా ఓట్లు అడిగారు.

– సిద్దిపేటజోన్



ముద్ద పెట్టుకో.. గుర్తు పెట్టుకో..



చేర్యాల(సిద్దిపేట): జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా బుధవారం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి. ఇందులో భాగంగా ఓ వృద్ధుడికి చెంచాతో అన్నం తినిపిస్తూ ఓటు అభ్యర్థించాడు. ఆయన వెంట స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పలువురు ఉన్నారు.

అభిమానానికి నిలువెత్తు ఆదారం

సిద్దిపేటకు చెందిన ముగ్గురు యువకులు రెండు వారాలు శ్రమించి దాదాపు 6 కిలోమీటర్ల పొడవైన దారంతో, 4 వేల మలుపులతో, ఆరు మీటర్ల ఎత్తు, ఆరు మీటర్ల పొడవునా త్రేడ్ ఉపయోగించి మంత్రి హరీశ్‌రావు బొమ్మ రూపకల్పన చేశారు. బుధవారం మంత్రి నివాసంలో ఆర్ట్ బొమ్మను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువకులు వినయ్, బాలాజీ, సంతోష్‌ను హరీశ్‌రావు అభినందించారు.

– సిద్దిపేటజోన్



అభివృద్ధిని అడ్డుకోవడమే వారి పని

- ఇక్కడ పరిశ్రమలు రాకుండా చేసింది కాంగ్రెస్ నాయకులే..
- ఉద్యోగ అవకాశాలు కోల్పోయిన నిరుద్యోగులు
- అందోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్



ప్రచారంలో మాట్లాడుతున్న క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక పనులను అడ్డుకోవడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుందని అందోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ మండిపడ్డారు. బుధవారం మండలంలోని పెద్దలోడి, లింగంపల్లి, కంకోల్, బోడపల్లి, తక్కడపల్లి, ఖమ్మంపల్లి, మునిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లో క్రాంతికిరణ్‌కు మంగళహారతులు ఇచ్చి మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ.. ఇక్కడి నిరుద్యోగ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సీఎం కేసీఆర్ మునిపల్లి మండలం లింగంపల్లి, కంకోల్, మగ్దుంపల్లి గ్రామ శివారులో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను మంజూరు చేశారన్నారు. కోర్టులో కేసులు వేసి పరిశ్రమ ఏర్పాటు కాకుండా దామోదర రాజనర్సింహ అడ్డుకున్నారని దుయ్యబట్టారు. పరిశ్రమ ఏర్పాటై ఉంటే సుమారు 5,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేవని ఆవేదన వ్యక్తం చేశారు. కారు గుర్తుకు మరోసారి ఓటేసి మూడోసారి కేసీఆర్‌ను సీఎంగా, రెండోసారి నన్ను అందోల్ ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను వేడుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మీనాక్షి, ఎంపీపీ శైలజా, ఎంపీపీ ఉపాధ్యక్షుడు ఖమ్రొద్దీన్, మాజీ జెడ్పీ చైర్మన్ బాలయ్య, మాజీ ఎంపీపీ చంద్రయ్య, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సాయికుమార్, విజయ్ కుమార్, శివశంకర్, శశికుమార్, వెంకటేశం, రాంచందర్‌రావు, నవాజ్‌రెడ్డి, మొగులయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

రాయికోడ్(అందోల్) : మండలంలోని కుసునూర్ గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మహేశ్, మండల సంఘం నాయకుడు మాణిక్ తమ అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలయ్య, బసవరాజ్ పాటిల్, విఠల్, శివకుమార్ పాటిల్, బస్వరాజ్, శంకర్, సంగమేశ్వర్ పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

రఘునందన్ రావును గెలిపించండి

- అప్పుడే మీ బతుకులు మారుతాయి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ
- దుబ్బాకలో రోడ్ షో



దుబ్బాకలో రోడ్ షోకు హాజరైన ప్రజలు,

దుబ్బాకటౌన్: తెలివిపరుడు.. చట్టం తెలిసిన వ్యక్తి.. ధైర్యవంతుడైన రఘునందన్ రావును గెలిపిస్తేనే దుబ్బాక ప్రజల బతుకులు మారుతాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావుకు మద్దతుగా బుధవారం దుబ్బాక పట్టణంలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సీఎం చేస్తామని ప్రధాని మోదీ స్వయంగా ప్రకటించాడని, మాట ఇస్తే తప్పడని అన్నారు. రాష్ట్రంలో 50 శాతం కంటే ఎక్కువ జనాభా ఉన్న బీసీలకు ఏ పార్టీ అన్నా సీఎం పదవి ఇచ్చిందా ఆలోచించాలని ఇప్పుడు బీసీ సీఎం చేస్తానన్న బీజేపీనే అధికారంలోకి తెచ్చుకోవాలన్నారు.

బీసీకే సీఎం పదవి : రఘునందన్‌రావు

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సీఎం అవుతాడని దుబ్బాక పార్టీ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. తాను ప్రజల కోసం ఎంతకైనా తెగిస్తానని, మీ కోసం ప్రాణాలు ఇచ్చేందుకైనా వెనుకాడనన్నారు. నాపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపిస్తే అన్ని వర్గాలకు న్యాయం చేస్తానన్నారు.

కుక్కల్లా మొరుగుతున్నారు

రాయపోలు(దుబ్బాక): తమ పార్టీ ఓటమిని ముందే ఊహించి బావ, బావమరుదులు కేటీఆర్, హరీశ్‌రావు కుక్కల్లా మొరుగుతున్నారని, వారికి అధికార మదం కళ్లకు కమ్మేసిందని దుబ్బాక ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు తీవ్ర పదజాలంతో విమర్శించారు. బుధవారం రాత్రి రాయపోలులో ఈటెల రాజేందర్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. దుబ్బాకలో ఎలాంటి అభివృద్ధి పనులకు సహకరించని మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు రాయపోలు, దౌల్తాబాద్ మండలాల్లో పర్యటించి కనీసం సంస్కారం లేకుండా తనపై వాగారన్నారు. గత ఉప ఎన్నికల్లో ఆరడుగుల బుల్లెట్టు అని చెప్పుకునే హరీశ్‌రావుకు బుద్ధిచెప్పిన దుబ్బాక ప్రజలు.. ఈసారి చోటా కేటీఆర్‌కు చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కానుగంటి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, మాదాసు వెంకట్‌గౌడ్, మంకిడి స్వామి, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల విరాళం



చేగుంటలో విరాళం అందిస్తున్న చిన్నారులు

చేగుంట(తూప్రాన్): దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు రెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిన్నారులు ఎన్నికల ఖర్చుల కోసం కిడ్డీ బ్యాంకులో దాచుకున్న డబ్బును అందించారు. మంగళవారం రాత్రి రెడ్డిపల్లి గ్రామంలో రఘునందన్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నిత్య, యశస్వినీలు కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.1,500 ఆయనకు అందజేశారు. వడియారం గ్రామంలో మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు లావణ్య, యువమోర్చా నాయకులు చందూ, రతన్‌సింగ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, వెంగళరావు, బాలచందర్, వైస్ ఎంపీపీ రాంచంద్రం, గోవింద్, నదీమ్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు.

'రియల్' బ్రోకర్ కేసీఆర్

- బీజేపీ నేత ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఈటల, పక్కన రఘునందన్

రాయపోలు(దుబ్బాక): సీఎం కేసీఆర్ రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా మారి దోచుకుంటున్నాడని బీజేపీ నేత ఈటల రాజేందర్ విమర్శించారు. బుధవారం రాత్రి జిల్లా రాయపోలు మండల కేంద్రంలో దుబ్బాక బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావుకు మద్దతుగా రోడ్‌షో నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఈటల మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గంలో 30 వేల కుటుంబాలు కేసీఆర్ బాధితులుగా ఉన్నారన్నారు. వేలాది ఎకరాల్లో అసైన్డ్ భూములను దళితుల నుంచి నామమాత్రపు పరిహారం చెల్లించి లాక్కొని వాటిని రూ.కోట్లలో విక్రయించి రియల్ వ్యాపారిగా మారాడన్నారు. సిద్దిపేట కలెక్టరేట్‌కు 20 ఎకరాల భూమి అవసరమైతే అక్కడ దళితుల నుంచి 352 ఎకరాలు లాక్కొన్నారన్నారు. కేసీఆర్ కుటుంబం తెలంగాణ రాష్ట్రానికి శనిలా దాపురించిందని, వారిని తరిమికొట్టాలన్నారు. దుబ్బాక ప్రజలు మూడేళ్ల క్రితం జరిగిన ఉప ఎన్నికల్లో కేసీఆర్‌కు కర్రుకాల్చి వాత పెట్టారని, ఆ తర్వాత హుజురాబాద్ వంతు వచ్చిందన్నారు. ఇప్పుడు వారిని శాశ్వతంగా పంపాలన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లో జాప్యం సరికాదు

గజ్వేల్‌రూరల్: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌లో జాప్యం సరికాదని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. సభ్యత్వ నమోదులో భాగంగా బుధవారం గజ్వేల్‌లో వారు మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫాం 12 దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, సిబ్బందికి శిక్షణ సమయంలో పోస్టల్ బ్యాలెట్ పొందేందుకు దరఖాస్తు పూర్తి చేసి తీసుకున్నట్లు తెలిపారు. కాగా మళ్లీ శిక్షణ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ పంపిస్తామని అధికారులు చెప్పడం వల్ల ఎన్నికల సిబ్బంది అయోమయానికి గురవుతున్నట్లు తెలిపారు. ఇతర జిల్లాల ఉద్యోగులు సిద్దిపేట జిల్లాలో ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు.

సర్వే రిపోర్ట్స్‌తో కేసీఆర్ నారాజ్

ఏఐసీసీ కార్యదర్శి క్రిష్టోఫర్ తిలక్



మాట్లాడుతున్న క్రిష్టోఫర్ తిలక్

హుస్నాబాద్: అన్ని సర్వే రిపోర్ట్స్ కాంగ్రెస్ వైపే ఉన్నాయని తెలిసి సీఎం కేసీఆర్ నారాజ్‌గా ఉన్నారని ఏఐసీసీ కార్యదర్శి క్రిష్టోఫర్ తిలక్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిష్టోఫర్ తిలక్ మాట్లాడుతూ.. కేసీఆర్‌కు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆరోపించారు. నియోజకవర్గంలోని చిన్న ముల్కనూర్‌ను దత్తత తీసుకున్న సీఎం కేసీఆర్ ఎలాంటి అభివృద్ధి చేయలేదని, హుస్నాబాద్‌ను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని చెప్పిన మంత్రి హరీశ్‌రావు మాటలను ఏ ప్రాంత ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ పొన్నం ప్రభాకర్‌కు మద్దతుగా ఈ నెల 24వ తేదీన కాంగ్రెస్ అధినేత్రి ప్రియాంక గాంధీ హుస్నాబాద్‌కు వస్తున్నట్లు వెల్లడించారు.పట్టణంలోని అమరుల స్థూపం వద్ద భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని, సభకు దాదాపు 45 వేల మందిని తరలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ పరిశీలకులు గోపినాథ్ పళనియాప్పన్, టీపీసీసీ అధికార ప్రతినిధి మేనేని రోహిత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీఓ భవన శిలాఫలకం ధ్వంసం

- పోలీసులకు ఫిర్యాదు



హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ఐఓసీ భవనం ఎదుట ప్రభుత్వ భూమిలో టీఎన్‌జీఓ భవనానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. సెప్టెంబర్ 13న మంత్రి హరీశ్‌రావు ఐఓసీ భవనము ప్రారంభించిన రోజే టీఎన్‌జీఓ భవనానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ భూమిని రియల్ వ్యాపారులు ఆక్రమించి ప్లాట్‌లు చేసి విక్రయించారు. ప్లాట్‌లు కొనుగోలు చేసినవారు విక్రయించిన వారిపై ఒత్తిడి తేవడంతో అర్ధరాత్రి ఎవరూలేని సమయంలో శిలాఫలకమును ధ్వంసం చేశారని టీఎన్‌జీవో నాయకులు పోలీసులకు, ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. మంత్రి శంకుస్థాపన చేసిన శిలాఫలకమునే ధ్వంసము చేసిన వారు రేపు కార్యాలయాల్లోని రికార్డులను మాయం చేయరనే నమ్మకము ఏందంటున్నారు. దోషులను గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని టీఎన్‌జీఓ సంఘము నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

గజ్వేల్‌రూరల్: ప్రతిపక్ష పార్టీల నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని దిలాల్‌పూర్‌లో బుధవారం నిర్వహించిన ముదిరాజ్‌ల సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్నివర్గాల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్తయ్య, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు జగన్, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు కొంటమైన నర్సింలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆటలు అట్టహాసంగా..

- వర్గల్ గురుకులంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షిస్తున్న మల్లయ్యభట్టు, తదితరులు



ఆటల పోటీల సందర్భంగా క్రీడాకారుల ఓత్ టేకింగ్ దృశ్యం

వర్గల్(గజ్వేల్): జ్యోతిబా పూలే బీసీ గురుకులాల బాలికల రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు తెరలేచింది. సిద్దిపేట జిల్లా వర్గల్ పూలే గురుకులం వేదికగా నాలుగు రోజులపాటు కొనసాగే ఈ పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతోపాటు ఆతిథ్య ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 1,000 మందికిపైగా క్రీడాకారులు వర్గల్ చేరుకోవడంతో పాఠశాల ప్రాంగణమంతా నిండుదనం సంతరించుకుంది. క్రీడాకారులు, విద్యార్థులు, ముఖ్యఅతిథులు, క్రీడాభిమానులతో గురుకుల ప్రాంగణం కిటకిటలాడింది. టోర్నీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల సొసైటీ సెక్రటరీ మల్లయ్య భట్టు, ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాస్ హాజరయ్యారు. వారికి మెదక్ ఆర్సీఓ ప్రభాకర్, ఆతిథ్య గురుకుల ప్రిన్సిపాల్స్ లక్ష్మీదేవి, భాస్కర్‌రావు బృందం విద్యార్థులతో కలిసి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఉమ్మడి జిల్లాల వారీగా బాలికల మార్చ్‌ఫాస్ట్ కొనసాగింది. ముఖ్యఅతిథులు గౌరవ వందనం స్వీకరించి, క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలు ప్రారంభించారు. ఓత్ టేకింగ్ కార్యక్రమాలు వరుసగా జరిగాయి. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

తొలిరోజు హోరాహోరీగా..

అండర్–19 విభాగంలో ఖమ్మం, కరీంనగర్ జట్ల మధ్య కబడ్డీ తొలి పోటీ జరిగింది. ఖమ్మం విజేతగా నిలిచింది. అదే విధంగా అండర్–19 వాలీబాల్ పోటీ రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల మధ్య జరగగా రంగారెడ్డి జిల్లా జట్టు గెలిచింది. పోటీల సందర్భంగా క్రీడాప్రాంగణం కేరింతలు, చప్పట్లతో హోరెత్తింది.